క్లుప్తంగా

నేడు ఉచిత కాలేయ పరీక్ష శిబిరం

గుంటూరు రూరల్: ఉచిత కాలేయ పరీక్ష శిబిరం మంగళవారం నిర్వహించనున్నట్లు శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ ఆస్పత్రి చీఫ్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర శివారుల్లోని గోరంట్ల గ్రామం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని ఆస్పత్రిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శిబిరాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు శిబిరాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

ఏఎన్‌యూ ఫైనాన్స్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డికి సన్మానం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఫైనాన్స్ ఆఫీసర్ గా విధులు నిర్వహించిన ఎం.చంద్రశేఖర్ రెడ్డి యూనివర్సిటీ నుంచి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలోని పరిపాలనా భవన్‌లో సోమవారం చంద్రశేఖరరెడ్డికి సన్మాన సభ నిర్వహించారు. వీసీ ఆచార్య కె.గంగాధర రావు, రెక్టార్ కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం సన్మానించారు. యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి విలువైన సేవలు అందించారని కొనియాడారు. చంద్రశేఖర్ రెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రస్తుతం ఏఎన్‌యూ అకౌంట్స్ విభాగంలో డెప్యూటీ రిజిస్ట్రార్‌గా ఉన్న ఏ వెంకటేశ్వర్లకు యూనివర్సిటీ ఫైనాన్స్ ఆఫీసర్‌గా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు.

ప్రజా సమస్యలపై పోరాటం

లక్ష్మీపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం వ్యవసాయ కార్మిక సంఘం పనిచేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ కోరారురు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో సోమవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం సంఘ జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాసు అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నెలలో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు. నాయకులు షేక్ గౌస్, గుర్రంకొండ సత్యానందం, తన్నీరు ప్రభుదాసు, కంభంపాటి దేవుని దయ, పంతగాని మరియదాసు, కోటేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

లక్ష్మీపురం: ప్రభుత్వ సంక్షేమ హాస్టల్స్, విద్యా సంస్థలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి అని కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ గుంటూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ.యశ్వంత్, షేక్ సమీర్ మాట్లాడుతూ గుంటూరు లో ఉన్న కోడి గుడ్డు సత్రం హాస్టల్‌ను ప్రారంభించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు మూడు వేల కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దాసు, సురేష్ పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో మీడియాపై ఆంక్షలు


నగరంపాలెం: గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలో మీడియాపై మరోసారి ఆంక్షలు విధించారు. జిల్లా ఎస్పీగా సతీష్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇది రెండోసారి. డీపీఓలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు వచ్చే బాధితుల సమస్యలను కవరేజి నిమిత్తం స్పందన హాల్ వద్దకు మీడియా వచ్చేవారు. జిల్లా నలుమూలాల నుంచి వచ్చే అర్జీదారుల వివరాలను సేకరించేవారు. విలేకర్లపై విధించిన ఆంక్షలను జిల్లా ఏఆర్ ఏఎస్పీ హనుమంతు తెలిపారు. దీంతో డీపీఓలో విధించిన ఆంక్షలపై రాష్ట్ర, రేంజ్ పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. చెట్ల కింద విలేకరులు నిరసన తెలిపారు. విలేకర్లతో డీఎస్పీ బి.సీతారామయ్య చర్చలు జరిపారు. ఎస్బీ డీఎస్పీ జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందించారు. డీపీఓ లోకి మీడియాను అనుమతించారు.

సాటిలేని సినీ దిగ్గజం అక్కినేని

నగరంపాలెం: సాటిలేని సినీ దిగ్గజం అక్కినేని నాగేశ్వరరావు అని అక్కినేని నాగేశ్వరరావు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు పి.సూరిబాబు అన్నారు. ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆయన నటించిన అపురూప చిత్రాలను ఉచితంగా ప్రదర్శించిన పల్లవి, కీర్తన థియేటర్ల మేనేజర్ రామిరెడ్డిని సోమవారం కీర్తన థియేటర్ ఆవరణలో సత్కరించారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ మూడు రోజులపాటు 12 షోలు ప్రదర్శించగా, 3,200 మంది ప్రేక్షకులు, అభిమానులు ఉచితంగా వీక్షించారని పేర్కొన్నారు. రామిరెడ్డిని సత్కరించి, నూతన వస్త్రాలను అందించారు. కార్యక్రమంలో ప్రొపయిటర్ ఎస్.వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రోస్టేట్.. మగవారికి మాత్రమే

- ఇది ప్రోస్టేట్ క్యాన్సర్ అవగాహన మాసం
- ఆధునిక వైద్యసేవలతో వ్యాధి నయం



ప్రోస్టేట్ క్యాన్సర్ పోస్టర్

గుంటూరు మెడికల్: కేవలం మగవారికి మాత్రమే వచ్చే వ్యాధుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ ఒకటి. ఈ వ్యాధి 50 ఏళ్లు పైబడిన వారిలో కనిపిస్తుంది. వ్యాధిని సకాలంలో గుర్తించకపోతే శరీరంలోని ఇతర అవయవాలకు క్యాన్సర్ సోకే ప్రమాదం ఉంది. వ్యాధి సోకిన విషయం కూడా తెలియకుండానే ఇతర యూరాలజీ సమస్యలతో వైద్యం కోసం వెళ్లేవారిలో ఈ వ్యాధిని గుర్తిస్తున్నారు. జీవితం అర్థభాగంలో సంభవించే క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరితగతిన నయం చేయవచ్చు. 1989 నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ నెలను జాతీయ ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు. ప్రజలకు ప్రోస్టేట్ క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు అవసరం ఉంది.

వ్యాధి లక్షణాలు....

ప్రోస్టేట్ గ్రంథి మగవారి మూత్రనాళం కిందద ఉంటుంది. ఇది వీర్యకణాలను మోసుకెళ్లే ద్రవ పదార్థాన్ని తయారు చేయటం, లైంగిక సంపర్కం చేయటానికి దోహద పడుతుంది. సైలెంట్ కిల్లర్‌గా పిలువబడే వ్యాధి సోకినట్లు తెలుసుకోవటానికి వ్యాధి లక్షణాలు చాలా వరకు బయటపడకపోవటంతో వ్యాధి నిర్థారణ త్వరితగతిన జరగటం లేదు. అంగస్తంబన చాలా కష్టంగా ఉండటం, వీర్య స్థలనం చేసే సమయంలో నొప్పి రావటం, వీర్యం తగ్గిపోవటం, దీర్ఘకాలికంగా వెన్నుముకనొప్పి, తరచుగా మూత్ర విసర్జనకు వెళ్లటం, మూత్ర విసర్జనలో తొందరపాటు, అధికంగా మూత్రం వస్తున్నట్లు ఉండటం, మూత్ర విసర్జనకు చాలా సమయం తీసుకోవటం, మూత్రంలో రక్తం రావటం, రాత్రి నిద్రిస్తున్న సమయంలో మూత్ర విసర్జన వలన నిద్రాభంగం అవ్వటం, ఎముకలు నొప్పులు, కాళ్ల వాపులు, పొత్తికడుపు ఇబ్బందిగా ఉండటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

వ్యాధి నిర్ధారణ....

క్యాన్సర్ రావటానికి నిర్దిష్ట కారణాలు తెలియవు. ఎర్రటి మాంసం, అధిక కొవ్వుశాతం ఉన్న ఉత్పత్తులు, శుభ్రం లేకుండా వండిన మాంసం ఎక్కువగా తినటం వలన వచ్చే అవకాశాలు ఉన్నాయి. 50 ఏళ్లు పైబడిన మగవారిలో ఎక్కువ మంది వ్యాధి బారిన పడుతున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి బుధవారం, శనివారం యూరాలజీ వైద్య విభాగంలో వారానికి ఇద్దరు లేదా ముగ్గురు బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. జీజీహెచ్‌కు వచ్చే వారిలో అధికశాతం మంది వ్యాధి ముదిరిన తరువాత వస్తున్నవారే. జిల్లాలో సుమారు 30 మంది యూరాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతి నెలా పదిమంది వరకు బాధితులు చికిత్స కోసం వస్తున్నారు.

ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలి...



ప్రోస్టేట్ క్యాన్సర్ కుటుంబంలో ఒకరికి వస్తే ఇతరులు ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చు. జన్యుపరమైన కారణాలతో ఈ వ్యాధి సోకుతుంది. సీరం పీఎస్ఏ పరీక్ష ద్వారా వ్యాధి వస్తుందా లేదా అనే విషయాన్ని నిర్థారించవచ్చు. ఒత్తిడి వల్ల క్యాన్సర్ పెరిగే ప్రమాదం ఉంది. యోగా, వ్యాయామం చేయటం మంచిది. క్రమం తప్పకుండా వేళకు భోజనం చేయటం, క్యాన్సర్‌ను చంపే ఆహారమైన క్యాబేజ్, క్యాలీఫ్లవర్, పచ్చని ఆకుకూరలు, చేపలు ఆహారంలో తీసుకోవాలి.

–డాక్టర్ జొన్నకూటి కొర్నేలియస్, యూరాలజిస్ట్, గుంటూరు

ఆధునిక చికిత్సలతో నయం చేయవచ్చు...



ప్రోస్టేట్ క్యాన్సర్ చాలా చిన్నగా పెరుగుతుంది. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స చేయటం వలన పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్ సోకినవారు పీఎంఎస్ పెట్‌స్కాన్ పరీక్ష చేయించుకోవటం ద్వారా శరీరంలో ఏఏ భాగాల్లో క్యాన్సర్ సోకిందో తెలుసుకుని చికిత్స చేయవచ్చు. ఆపరేషన్లు, రేడియేషన్ చికిత్స, హార్మోనల్ ట్రీట్‌మెంట్, కీమోథెరపీ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధిని ముందస్తుగా గుర్తించి చికిత్స అందించటం వలన బాధితుడి జీవిత కాలాన్ని పొడిగించవచ్చు.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

వెస్ట్ తహసీల్దారుగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకారం



గుంటూరు రూరల్: గుంటూరు వెస్ట్ తహసీల్దారుగా కె.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దారు సీఆర్‌డీఏకు బదిలీపై వెళ్లగా 20 రోజులుగా డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సోమవారం సాధారణ బదిలీలలో భాగంగా వెంకటేశ్వరరావు బదిలీపై గుంటూరు వెస్ట్‌కు వచ్చారు. గతంలో ఆయన ప్రకాశం జిల్లా దర్శి తదితర ప్రాంతాల్లో పనిచేస్తూ ఎన్నికల సమయంలో మంగళగిరికి బదిలీపై వచ్చారు. అనంతరం గుంటూరు వెస్ట్ తహసీల్దారుగా ఉన్నతాదికారుల ఉత్తర్వులమేరకు బాధ్యతలు స్వీకరించారు.

విజ్ఞాన్, ఎస్ఈసీ ఇండస్ట్రీస్ మధ్య ఒప్పందం


విద్యాసాగర్‌తో పత్రాలను మార్చుకుంటున్న వీసీ

చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ సోమవారం తెలిపారు. ఎస్ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ దొంతినేనితో ఒప్పంద పత్రాల్ని మార్చుకున్నట్లు చెప్పారు. ఒప్పందం వల్ల ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామని తెలిపారు. వీటితో పాటు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామని పేర్కొన్నారు. విద్యాసాగర్ దొంతినేని మాట్లాడుతూ విద్యార్థుల్ని సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాల్లో తర్ఫీదునివ్వడమే ఈ ఒప్పందం లక్ష్యమని వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్ పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబాలతో సమస్యలు పరిష్కారం

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


రాజేంద్రప్రసాద్, ఆశాకరుణ్ దంపతులకు సన్మానం

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ పరిష్కారంగా నిలుస్తుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. కన్నావారితోటలోని ఎన్జీవో కళ్యాణ మండపంలో సోమవారం ప్రజా ఆలోచన వేదిక ఆధ్వర్యంలో ఆదర్శ దంపతులు ఆషా కరుణ్, రాజేంద్రప్రసాద్ షష్టిపూర్తి, వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరెడ్డి , డాక్టర్ కన్నా మాస్టారు, విరసం రాష్ట్ర నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్, అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, తెలుగు భాషా ఉద్యమ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు అధ్యక్షత వహించిన సభలో మాజేటి గురవయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల బోసుబాబు, టి.భాగ్యశ్రీ, పరమేశ్వర రెడ్డి, డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, కృష్ణ మోహన్, ఏ ఆర్ రమేష్, ఫ్యామిలీ కౌన్సిలర్ సుమతి, డాక్టర్ దేవిక సోమశేఖర్, ఎమ్మెస్సార్ కృష పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు

కమిషనర్ పులి శ్రీనివాసులు


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఇస్తున్న అర్జీలను క్షేత్ర స్థాయిలో అధికారులు నేరుగా పరిశీలించి, అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఫిర్యాదుల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం గత వారం అందిన అర్జీల పరిష్కారాలపై సమీక్ష చేస్తామని, కనుక ప్రతి అర్జీ సమగ్రంగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు జీఎంసీ కార్యాలయానికి వస్తున్నారని, అవి స్థానికంగానే పరిష్కారం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ప్రజల నుంచి 58 ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి 18, ఇంజినీరింగ్ విభాగానికి 18, రెవెన్యూ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి 11, అకౌంట్స్ విభాగానికి 6, ఉపా సెల్ విభాగానికి 1 చొప్పున వచ్చినట్లు పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని విభాగాధిపతులకు ఆదేశించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ మధుసూదన్, ఉపా సెల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జవాబుదారీగా ఉండాలి

నగరపాలక సంస్థ ఉద్యోగులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా, కేటాయించిన విధుల్లో నిర్దేశిత సమయపాలన పాటించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని వివిధ విభాగాలను ఆకస్మిక తనిఖీ చేసి, విభాగాధిపతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగులు తప్పనిసరిగా సమయ పాలన పాటిస్తూ, కార్యాలయానికి వివిధ అర్జీలు, ఫిర్యాదులపై వచ్చే ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ రాంబాబు, ఏసీపీ మురళి పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధికి సలహాలు సూచనలు సేకరణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 విజన్ అభివృద్ధి కోసం చేపట్టనున్న డాక్యుమెంట్ కోసం ఈ నెల 25న జరిగే వార్డు సభలు కీలకమని, సభల్లో ప్రజల నుంచి రాష్ట్ర అభివృద్ధికి సూచనలు, సలహాలను ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ ద్వారా సేకరించనున్నట్లు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కౌన్సిల్ హాల్లో స్వర్ణాంధ్ర 2047 విజన్ అభివృద్ధిపై నిర్వహించనున్న వార్డు సభల నిర్వహణపై ప్రత్యేక, నోడల్ అధికారులతో కమిషనర్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఈ నెల 25న ప్రతి ఎలక్షన్ వార్డులో వార్డ్ సభలు జరపాలన్నారు.

జిల్లా ఎస్పీని కలిసిన ప్రజా సంఘాల నాయకులు



నగరంపాలెం: ప్రజా సంఘాల నాయకులు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గుంటూరు నగరంలో నెలకొన్న ట్రాఫిక్, రహదారుల ఆక్రమణ, సీసీ కెమెరాల పనితీరుపై చర్చించారు. అనంతరం వాటిపై జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందించారు. బహుజన్ మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్‌సింగ్, నాయీ బ్రాహ్మణ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణయ్య, బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కన్వీనర్ సాధం మాల్యాద్రి, జిల్లా రజక జనసేవ సంఘం నాయకులు వట్టికూటి సాంబయ్య, బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్, బీపీ మండల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తన్నీరు సాంబయ్య, నల్లపు నీలాంబరం, ముస్లిం మహిళా నాయకురాలు షేక్ సలీమా, ఆవాజ్ నగర అధ్యక్షుడు షేక్ సైదా, ముదిరాజ్ సంఘం నాయకులు బ్రహ్మయ్య, నగర రజక జనసేవ సంఘం నాయకులు మెట్టుపల్లి మహేంద్ర, టి.రాము, బి.సునీల్, పి.రవితేజ పాల్గొన్నారు.

సామాజిక కవి గుర్రం జాషువా

నగరంపాలెం: సామాజిక సంస్కరణ కోసం కవిత్వం రాసిన గొప్ప సామాజిక కవి గుర్రం జాషువా అని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. మహాకవి గుర్రం జాషువా జయంతి ఉత్సవాలలో భాగంగా మహాకవి జాషువా కళాపీఠం ఆధ్వర్యంలో జాషువా సాహిత్యం సామాజిక సంస్కరణ అంశంపై సోమవారం హిందూ కళాశాల సమావేశ మందిరంలో సభ జరిగింది. సభకు మాదిగ జన సేవాసమితి నాయకులు అత్తోట జోసెఫ్‌కుమార్ అధ్యక్షత వహించారు. మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ దాసరి జాన్ బాబు మాట్లాడారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పిఎం.ప్రసాద్‌ను సత్కరించారు. ప్రముఖ పద్య నాయకులు గుర్రాల వెంకటేశ్వర్లు, జెట్టి బాబూరావు, చంద్రపాల్ పాడిన పద్యాలు సభాసదులను ఆకట్టుకున్నాయి. సభలో కళాశాల లెక్చరర్ నటరాజకుమారి, బీజేపీ నేత కె.భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

భూమాతను పరిరక్షించుకోవాలి

నగరంపాలెం: పంచ భూతాలలో భూమి ఉత్తమమైనదని ప్రముఖ సాహితీవేత్త ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్(మహిళా విభాగం) ఆధ్వర్యంలో సోమవారం బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నమయ్య కళావేదికపై నిర్వహించి సభలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ తుసు గుంట్ల రాధాబాయి, ఆలయ పాలకవర్గం అధ్యక్షులు మస్తానయ్య పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

పట్నంబజారు: గంజాయి విక్రయించినా, సరఫరాకు సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ చెప్పారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గంజాయి విక్రయాలు, చోరీల నియంత్రణకు పూర్తి స్థాయిలో చర్యలు చేపడతున్నామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, వాటి నియంత్రణకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈస్ట్ పరిధిలో అర్ధరాత్రి సమయంలో ఎలాంటి వివాదాలకు తావులేకుండా దుకాణాలు రాత్రి 11 గంటలకు మూసివేయాలని సూచించారు. పోలీసు అత్యవసర సేవలకు సంబంధించి 112 నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు. సమావేశంలో ఈస్ట్ సబ్‌డివిజన్ సీఐలు శివప్రసాద్, వైవీ సోమయ్య, వీరయ్య, పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అభినందనీయం

పట్నంబజారు: ఆపదలో ఉన్న వారికి సాయం అందించడం ఎంతో అభినందనీయమని కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. నెహ్రూనగర్ ప్రాంతంలో మున్సిపాలిటీ వర్కర్‌గా పనిచేస్తున్న రమణమ్మ ఏడాదిన్నర బిడ్డ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండగా తిరుపతిలో చిన్నారికి ఆపరేషన్ చేయిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న నెహ్రూనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఘంటా శివనాగేశ్వరరావు కార్మికురాలికి రూ.75 నగదు ఆర్థిక సాయంగా అందజేశారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, కొత్తపేట పోలీస్ స్టేషన్ సీఐ ఎం వీరయ్య చేతుల మీదగా నగదును కార్మికురాలకి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఘంటా శివనాగేశ్వరరావు, సభ్యులు బండి రాంప్రభూ, శంకర్, గట్టు శీను, వినోద్ పాల్గొన్నారు.

తిరుపాలుకు ఘన నివాళి

లక్ష్మీపురం: తిరుపాలు వైద్యరంగానికి అందించిన సేవలు మరువలేనివని ఏఐటీయూసీ నాయకులు కోటా మాల్యాద్రి పేర్కొన్నారు. స్థానిక గుంటూరు సమగ్రాస్పత్రి, ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో సోమవారం తిరుపాలు వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, నాగరాజు, కుమార్ రాజా, బాలాజీ, రవి శంకర్,,రాంబాబు, కృష్ణ పాల్గొన్నారు.

కార్మికుల జీతాలు వెంటనే చెల్లించాలి

ఏపీఐసీపీ ఆటోనగర్ గడ్డిపాడులో పారిశుద్ధ్య కార్మికుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐటీయూసీ కోట మల్యాద్రి మాట్లాడుతూ కాంట్రాక్టర్ మారిన వర్కర్లను మార్చకూడదని, పీఎఫ్, ఈఎస్ఐ, జీతాల చెల్లింపులు కాంట్రాక్టర్ ద్వారా చేయించాల్సిన బాధ్యత అధికారులదన్నారు. నగర కమిటీ సభ్యులు చల్ల మరియదాస్ మాట్లాడారు. కార్యక్రమంలో గురు స్వామి, బండి స్వాతి, లక్ష్మి, శ్రీను, శివకుమార్, ఏడుకొండలు పాల్గొన్నారు.

వైభవంగా ఓనమ్


జ్యోతి ప్రజ్వలనతో వేడుకలను ప్రారంభిస్తున్న కేవీ సెబాస్టియన్, మంజు

కేరళ సంప్రదాయ వస్త్రాలతో ఆకట్టుకున్న విద్యార్థినులు



విద్యార్థినుల సంప్రదాయ నృత్య ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: శ్యామలానగర్‌లోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం ఓనమ్ వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం కేరళ సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ సెబాస్టియన్ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో జాతి, కుల, మతాలకు అతీతంగా జరుపుకునే అతిపెద్ద పండుగ ఓనమ్ అని, మహాబలి చక్రవర్తి తన ప్రజల కోసం ప్రతి యేటా ఓనమ్ రోజున వస్తారనేది ప్రజల నమ్మకమని అన్నారు. ప్రజలు తమ ఇళ్లను పూలతో అలంకరించుకుని, సంప్రదాయ వస్త్రాలను ధరించి బలి చక్రవర్తికి స్వాగతం పలుకుతారని పేర్కొన్నారు. ప్రాంతాలకు అతీతంగా ఓనమ్ పండుగను గుంటూరులో ఘనంగా జరుపుతున్నామని చెప్పారు. ఈసందర్భంగా విద్యార్థినులు కేరళ సంప్రదాయ నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మంజు సెబాస్టియన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల నిరసన


సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులు సోమవారం విధులు బహిష్కరించి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పట్టించుకోవాలంటూ ప్లకార్డులు చేతితో పట్టుకుని, మెడలో వేసుకుని పెద్దఎత్తున నినాదాలు చేశారు. రెగ్యులర్ స్టాఫ్‌నర్సు ఉద్యోగాల నోటిఫికేషన్ 15 ఏళ్లుగా ఇవ్వకపోవడం వల్ల తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. తమ డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ యూనియన్ రాష్ట్ర నాయకురాలు పి.మనీష, జిల్లా అధ్యక్షురాలు రేణుక, సెక్రటరీ శివమ్మ, కోశాధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు కోటేశ్వరి, సౌజన్య, కరుణ, జాయింట్ సెక్రటరీలు హైమావతి, సంధ్యా, మేరీ, రమాదేవి, సభ్యులు కుసుమ కుమారి, సుధారాణి, బాలసుందరి, అంజమ్మ, సురేష్, సర్దార్, సుభాని పాల్గొన్నారు.

రేపు బాలు స్వర నీరాజనం

నగరంపాలెం: ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి పురస్కరించుకుని ఈనెల 25న గానగంధర్వునికి స్వరనీరాజనం నిర్వహించనున్నట్లు కళాదర్బార్ అమరావతి వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నాజ్ కూడలిలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించి, అనంతరం ఉదయం 11 గంటలకు అదే ప్రాంతంలోని హోటల్ ఆర్చిడ్‌లో బాలు స్వర నీరాజనం సంగీత విభావరి జరుగుతుందని చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్యశిబిరం



గుంటూరు మెడికల్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా సేవ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక బృందావన్ గార్డెన్స్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులకు, 60 సంవత్సరాలు పైబడిన మహిళలకు ఆరుగురు స్పెషలిస్ట్ వైద్యులతో పరీక్షలు నిర్వహించి 30 రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేసి మందులు ఉచితంగా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, సేవా పక్వాడ కోఆర్డినేటర్స్ ఏలూరి లక్ష్మి, జూపూడి దుర్గాభవాని, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి యాదవ్, నాయకులు సీహెచ్ తిరుపతిరావు, కుమార్ గౌడ్, సుబ్బారావు, వెంకటేష్ యాదవ్, వి.గంగాధర్, జితేంద్ర గుప్తా, బెహరా గాయత్రి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అబూబకర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

స్థలం కోసం వ్యక్తిపై దాడి

లక్ష్మీపురం: స్థలం విషయమై వ్యక్తిపై ముగ్గురు కలసి కర్రతో దాడిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కృష్ణబాబు కాలనీకి చెందిన టి.నరసింహారవు, ఇంటి పక్కన నివాసం ఉంటున్న సుధ, వంశీ, రమ్యలతో స్థల వివాదం కొంత కాలంగా ఉంది. మూడు అంగుళాల స్థలంలో ఇటుక రాయి పెట్టారని నరసింహారావు అతడి కుమారుడితో కలసి మార్కెట్ నుంచి ఇంటికి వచ్చిన సమయంలో ముగ్గురు నరసింహారావుపై కర్రతో దాడి చేశారు. ఈ విషయం ఆస్పత్రిలో చికిత్స పొందిన నరసింహారావు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

■ మద్యం మత్తులో..

స్థానిక చుట్టు గుంట సెంటర్‌లో సోమవారం రాత్రి మద్యం తాగి ద్విచక్రవాహనంపై వెళుతున్న ఓ వ్యక్తి పై దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. ఏటీ అగ్రహారానికి చెందిన అద్దంకి నాగమల్లేశ్వరరావు కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. సోమవారం రాత్రి 9 గంటల సమయంలో రిలయన్స్‌లో సరకులు కొనుగోలు చేసుకుని తిరిగి ఇంటికి వెళుతున్న సమయంలో దారి మార్గంలో చుట్టు గుంట వద్ద కె.వి.పి.కాలనీకి చెందిన అనిల్ ఫూటుగా మద్యం తాగి నాగమల్లేశ్వరరావుపై దాడి చేసి గాయపరిచాడు. దీంతో స్థానికులు అడ్డుకుని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నగరంపాలెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మద్యం మత్తులో ఉన్న అనిల్‌ను స్టేషన్‌కు తరలించారు. బాధితుడు నాగమల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

■ వివాహానికి పిలువులేదని..

ఒకే ప్రాంతంలో నివాసం ఉండే ఇద్దరు స్నేహితులలో ఒకరు వివాహం చేసుకోగా వివాహానికి పిలవలేదని మద్యం తాగి నిలదీడంతో మద్యం మత్తులో ఉన్న మరో స్నేహితుడు అతడి తండ్రి దాడి చేసిన ఘటనపై తండ్రీకొడుకులపై నగరం పాలెం పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. వికలాంగుల కాలనీ 3వ లైన్ ప్రాంతానికి చెందిన దేరంగుల సాయికుమార్, ఏసీ మెకానిక్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అదే ప్రాంతానికి చెందిన నాగరాజు స్నేహితులు. అయితే నాగరాజుకు పది రోజుల క్రితం వివాహం జరిగింది. వివాహానికి పిలువలేదని మద్యం తాగిన సాయికుమార్, నాగరాజును నిలదీశాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో నాగరాజు తండ్రి, మారయ్య, ఇద్దరు కలసి సాయికుమార్‌పై కర్రతో దాడి చేయగా కంటికి తీవ్ర గాయం అయింది. దీంతో సాయికుమార్ ఆస్పత్రిలో చికిత్స పొంది నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నాగరాజు, అతడి తండ్రి మారయ్యలపై కేసు నమోదు చేశారు.